


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 11 | మే | 2026 | పేజీలు : 5


## పవిత్ర గోదావరి నదికి హారతి సమర్పణ



**భద్రాచలం టౌన్, మే 10, ప్రజాజ్యోతి** భద్రాచలంలోని పవిత్ర గోదావరి నదికి ఆదివారం నదీ హారతి సమర్పించారు. తొలుత గణపతి పూజ, దీపోత్సవం భక్తులచే వెలిగింప చేసి, భక్తులు స్పృశించిన పూజా ద్రవ్యాలతో, శ్రీరామునికి, గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేసి లోక కళ్యాణార్థం హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సత్య ప్రసాద్ శర్మ, రామాచార్యులు, ఫణి కుమార్ శర్మ, తేజ శర్మ, కృష్ణ శర్మ హారతులు సమర్పించగా,స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు మరియు , అధిక సంఖ్యలోభక్తులు పాల్గొన్నారు.






# ఎన్నాళ్లు.. నిరీక్షించాలో..?

- చర్ల నుండి ఆర్టీసీ దూరప్రాంత సేవలు కలలా మారాయా..?
- హైదరాబాద్, విజయవాడ, గుంటూరుకు అందుబాటులో లేని బస్సులు
- జిల్లా కేంద్రం కొత్తగూడెంకు నేరుగా బస్సులేని వైనం
- ఎన్నో వినతి పత్రాలు..అనేక హామీలు.. చర్యలు మాత్రం శూన్యం..!
- స్పందించని ఆర్టీసీ అధికారులు

3 లో..

చర్ల మండల ప్రజల దూర ప్రాంతాల రవాణా కష్టాలు రోజురోజుకూ మరింత తీవ్రమవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు ఆంధ్రప్రదేశ్ లోని ప్రధాన నగరాలు విజయవాడ, గుంటూరు, అలాగే జిల్లా కేంద్రం కొత్తగూడెంకు నేరుగా ప్రభుత్వ ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా సంవత్సరాలుగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ ఇప్పటివరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సరైన చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని వ్యక్తమవుతున్నది .మండల పరిధిలో అనేక గ్రామాలు ఉండగా వందలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, కూలీలు, రైతులు ప్రతిరోజూ ఇతర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తోంది. కానీ ప్రభుత్వ ఆర్టీసీ రవాణా సౌకర్యాలు దూరప్రాంతాలకు లేక ప్రజలు ప్రైవేట్ ట్రావెల్స్, ఇతర వ్యక్తిగత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది.

● చర్ల, ప్రజాజ్యోతి

## సీసీ రోడ్లు వేశారు.. మట్టి పోయడం మరిచారు



**టేకులపల్లి, మే10, ప్రజాజ్యోతి:** గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్లతో ప్రజలు నరక యాతనపడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందు కుగాను ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రోడ్లు వేసి వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేస్తోంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఎస్ డీఎఫ్, పంచాయతీరాజ్ శాఖ, ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తోంది.ఈ రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు సీసీ రోడ్లు వేస్తున్నారు కానీ ఆరోడ్లకు ఇరువైపులా(రోడ్డుసైడ్ బర్మ్ లకు)మొరం పోయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలం ఎర్రాయి గూడెం 25 లక్షలు, ఇప్పలతండా 14 లక్షలు రూపాయలతో రోడ్లు నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు.కానీ అప్పటి నుంచి నేటి వరకు రోడ్డు సైడ్ బర్మ్ లకు మొరం పోయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదో ఏదో ఒక ప్రమాదం జరిగేదాకా చూస్తూ ఉండడం కంటే ముందుగా స్పందించి

మిగతా 2 లో...

## రామయ్య చెంతకు అంజన్న మాలధారణ భక్తులు

- రేపు రామాలయంలో మాల విరమణకు దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- కొండగట్టు అంజన్నకు భద్రాద్రి రామయ్య పట్టు వస్త్రాలు అందజేసిన దేవస్థానం ఈవో



**భద్రాచలం టౌన్ , మే 10 , ప్రజాజ్యోతి** భద్రాచలంలో మంగళవారం జరిగే హనుమాన్ జయంతి వేడుకలకు శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం సిద్ధమవుతోంది. ఇప్పటికే రాష్ట్రంలోని కరీంనగర్, వరంగల్, నల్గొండ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి అంజన్న దీక్షితులు భద్రాచలం చేరుకొని రామయ్య దర్శనం చేసుకుంటున్నారు. గత మూడు రోజులుగా హనుమాన్ భక్తుల రద్దీ పెరిగింది. అలాగే రామాలయంలో సైతం మంగళవారం జరిగే హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా దేవస్థానం తరపున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రామాలయ సమయాల్లో

మిగతా 2 లో...

# సీసీ రోడ్లు వేశారు.. మట్టి పోయడం మరిచారు



(మొదటి పేజీ తరువాయి...)



రోడ్ సైడ్లు మొరం పోసి ప్రమాదాలకు జరగకుండా చూడడం గ్రామస్తులకు ప్రయాణికులకు ఎంతో సురక్షితమని అన్నారు. రోడ్డు సైడ్లు ప్రమాదంలో ఉన్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తస్మాత్ జాగ్రత్తగా ఉండండి. వారిని దృష్టిలో పెట్టుకొని మొరంను పోయించగలరని అధికారులను మండల ప్రజలు కోరుకుంటున్నాను.

# ఆత్మలింగేశ్వర స్వామి దేవాలయం వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ



**పాల్వంచ, మే 10, ప్రజాజ్యోతి :** పాల్వంచ పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఆత్మలింగేశ్వర స్వామి దేవాలయం వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన మహా కుంభాభిషేక కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ పవిత్ర కార్యక్రమానికి కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తులతో కలిసి ఆలయ ఉత్సవాల్లో పాల్గొనడంతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణ నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ సంస్థాన వారసుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, 35వ డివిజన్ కార్పొరేటర్ నామా కీర్తి, 41వ డివిజన్ కార్పొరేటర్ గొర్లె అన్నపూర్ణ నరేష్ పాల్గొన్నారు. అలాగే జీకే రాజు దంపతులు, మధు (జేసీబీ), వీరయ్య, ఆలపాటి ప్రసాద్తో పాటు పెద్ద ఎత్తున భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ మహా కుంభాభిషేకం పాల్వంచలో ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించిందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

# రామయ్య చెంతకు అంజన్న మాలధారణ భక్తులు

(మొదటి పేజీ తరువాయి...)

మార్పుతో పాటు అంజన్న ఆలయం వద్ద భక్తులకు త్వరితగతిన దర్శనం, మాల విరమణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రముఖ అంజన్న క్షేత్రమైన కొండగట్టులో ఆదివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తరపున హనుమజ్జంతి సందర్భంగా పట్టువస్త్రాలు దేవస్థానం ఈవో కె.దామోదర్ రావు ఆధ్వర్యంలో బృందం సమర్పించారు. ఈ సందర్భంగా కొండగట్టు దేవస్థానం తరపున ఆలయ అధికారులు స్వాగతం పలుకగా ఒగ్గు డోలు నృత్యాలు, కోలాటాలతో కళాకారుల విన్యాసాలు చేస్తుండగా హనుమాన్ భక్తుల సమక్షంలో భద్రాద్రి రామయ్య కానుకగా పట్టువస్త్రాలను కొండగట్టు వైదిక బృందంకు అందజేశారు. ప్రతి ఏటా ఇదే విధంగా పెద్ద జయంతి ఉత్సవాల సమయంలో భద్రాద్రి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తుంటారు.

**ఏటా అధిక సంఖ్యలో తరలివస్తున్న భక్తులు**

భద్రాచలంలో శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలతో పాటు హనుమాన్ జయంతికే అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రామయ్య స్వామికి హనుమాన్ వీర భక్తుడు కావడంతో ఇటీవల కాలంలో ఆంజనేయ మాలధారులు అధిక సంఖ్యలో



భద్రగిరి వస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు భద్రాద్రి రామయ్య చెంతన ఇరుముడి విరమిస్తున్నారు. సుమారు వారం రోజులపాటు 50 వేల మందికి పైగానే స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో గత ఐదేళ్ల నుంచి హనుమాన్ జయంతి క్రమంగా ఉత్సవంగా మారుతోంది. మంగళవారం హనుమాన్ జయంతి నిరహించనుండటంతో భక్తులకు దేవస్థానంలోని ఆంజనేయస్వామి ఉపాలయంలో మాలవిరమణ చేస్తారు.

# కిక్ బాక్సింగ్ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన అబ్దుల్ నుమాన్



**పాల్వంచ, మే 10, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించిన అబ్దుల్ నుమాన్ ను పలువురు అభినందించారు. కఠిన సాధన, పట్టుదల, క్రీడాపట్ల ఉన్న అంకితభావంతో అబ్దుల్ నుమాన్ ఈ విజయాన్ని అందుకోవడం గర్వకారణమని క్రీడా ప్రముఖులు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఆయన కనబరిచిన ప్రతిభ పాల్వంచకు మంచి గుర్తింపు తీసుకువచ్చిందని కొనియాడారు. ఈ సందర్భంగా కోచ్ లు, క్రీడా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, అబ్దుల్ నుమాన్ భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. యువత క్రీడల వైపు అడుగులు వేయడానికి ఆయన విజయం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ నుమాన్ మాట్లాడుతూ, తన విజయానికి కుటుంబ సభ్యులు, కోచ్ లు, స్నేహితుల ప్రోత్సాహమే ప్రధాన కారణమని తెలిపారు. భవిష్యత్తులో మరింత కష్టపడి ఉన్నత స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రానికి, పట్టణానికి మరిన్ని విజయాలు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

# ఈదురుగాలులతో రోడ్డుపై కూలిన రావి చెట్టు.. వెంటనే తొలగించిన పోలీసు సిబ్బంది





**పాల్వంచ, మే 10, ప్రజాజ్యోతి:** ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం, ఈదురుగాలుల ప్రభావంతో పాల్వంచ మండల పరిధిలోని పెద్దమ్మతల్లి గుడి సమీపంలో ఉన్న భారీ రావిచెట్టు రోడ్డుపై కూలిపోయింది. దీంతో కొంతసేపు ఆ మార్గంలో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వెంటనే పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టును తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకుని, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిస్థితిని చక్కదిద్దారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి వేగంగా స్పందించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఎక్కువసేపు కొనసాగకుండా నివారించగలిగారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగకపోవడం ఊరట కలిగించింది. అకాల వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల సమీపంలో వాహనాలు నిలపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. సమయానికి స్పందించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్న పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్, పోలీసు సిబ్బందిని స్థానికులు అభినందించారు.

# చిరు వ్యాపారులకు అండగా "మీకోసం మేమున్నాం టీం"

**చర్ల,మే 10:(ప్రజా జ్యోతి ):** ప్రతి ఆదివారం చర్లలో నిర్వహించే సంతలో చిరు వ్యాపారులు, వీధి వ్యాపారస్తులు మండే ఎండలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ కనీసం నిలువ నీడ కూడా లేక విలవిలాడుతున్న పరిస్థితిని గుర్తించిన "మీకోసం మేమున్నాం టీం" సభ్యులు వారికి అండగా నిలిచారు. ఈ సమస్య తమ దృష్టికి వచ్చిన వెంటనే, ముఖ్యంగా 50 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల మహిళా వ్యాపారులకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో 7 అడుగుల వెడల్పు గల నీడ గొడుగులను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఒక్కో గొడుగుకు రూ.700 చొప్పున విరాళాలు సేకరిస్తూ ఫండ్ రైజింగ్ కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో ఇప్పటికే మూడు విడతలుగా మొత్తం 24 గొడుగులను పంపిణీ చేసిన టీం సభ్యులు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఆదివారం ఉదయం 11.30 గంటలకు మరో 8 గొడుగులను చిరు వ్యాపారులకు అందజేశారు.



ఈ కార్యక్రమంలో మీకోసం మేమున్నాం టీం ఛైర్మన్ లయన్ నీలి ప్రకాష్ తో పాటు జవ్వాది సతీష్, జవ్వాది హర్షిత్, దొడ్డి సూరిబాబు, రెడ్డి శ్రీనివాస్, పున్నం రామకృష్ణ, దొడ్డి తాతారావు, కవ్వాల రాము, కాకి అనిల్, చింతలపాటి అశోక్, ఆలం ఈశ్వర్ పాల్గొన్నారు.






- చర్ల నుండి ఆర్టీసీ దూరప్రాంత సేవలు కలలా మారాయా..?
- హైదరాబాద్, విజయవాడ, గుంటూరుకు అందుబాటులో లేని బస్సులు
- జిల్లా కేంద్రం కొత్తగూడెంకు నేరుగా బస్సులేని వైనం
- ఎన్నో వినతి పత్రాలు..అనేక హామీలు.. చర్యలు మాత్రం శూన్యం..!
- స్పందించని ఆర్టీసీ అధికారులు

# ఎన్నాళ్లు.. నిరీక్షించాలో..?

**చర్ల మండల ప్రజల దూర ప్రాంతాల రవాణా కష్టాలు రోజురోజుకూ మరింత తీవ్రమవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు ఆంధ్రప్రదేశ్ లోని ప్రధాన నగరాలు విజయవాడ, గుంటూరు, అలాగే జిల్లా కేంద్రం కొత్తగూడెంకు నేరుగా ప్రభుత్వ ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా సంవత్సరాలుగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ ఇప్పటివరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సరైన చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని వ్యక్తమవుతున్నది .మండల పరిధిలో అనేక గ్రామాలు ఉండగా వందలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, కూలీలు, రైతులు ప్రతిరోజూ ఇతర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తోంది. కానీ ప్రభుత్వ ఆర్టీసీ రవాణా సౌకర్యాలు దూరప్రాంతాలకు లేక ప్రజలు ప్రైవేట్ ట్రావెల్స్, ఇతర వ్యక్తిగత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది.**

● చర్ల, ప్రజాజ్యోతి

దీంతో ప్రయాణ ఖర్చులు అమాంతం పెరిగిపోతుండగా పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక భారం మోయాల్సి వస్తోంది.“గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి” అంటూ గొప్పలు చెప్పే ప్రభుత్వం దూరప్రాంతాలకు కనీస బస్సు సౌకర్యం కూడా కల్పించలేకపోవడం దారుణమని ప్రజలు మండిపడుతున్నారు.చర్ల మండలంలో అత్యవసర వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ప్రజలు కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అయితే నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో రోగులు, గర్భిణీలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు సరైన రవాణా లేక ప్రాణాలు సైతం ప్రమాదంలో పడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొన్ని సందర్భాల్లో అంబులెన్స్ అందుబాటులో లేకపోతే ప్రైవేట్ వాహనాలకు వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు.హైదరాబాద్, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు చర్ల నుండి ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని బస్సులు లేకపోవడంతో పలుమార్లు బస్సులు మారాల్సి వస్తోంది అని దీంతో సమయం, డబ్బు రెండూ వృథా అవుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.ప్రభుత్వ బస్సులు లేకపోవడంతో ప్రతిరోజు చర్ల మండలం నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్ కు నడుస్తూ ఉండగా ఒక్క ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా లేదని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పండుగలు, సెలవుల సమయంలో టికెట్ ధరలను రెట్టింపు చేస్తున్నారని అనుమతులకు మించిన ప్రయాణికులను ఎక్కించడం, అతి వేగంగా ప్రైవేటు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల భయం వెంటాడుతోందని చెబుతున్నారు.

### ››› ఎన్నో వినతిపత్రాలు... స్పందన మాత్రం శూన్యం.!:

చర్ల మండల ప్రజలు ఎన్నోసార్లు ఆర్టీసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి ఫలితం కనిపించడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్ల–హైదరాబాద్, చర్ల–విజయవాడ, చర్ల–గుంటూరు, చర్ల–కొత్తగూడెం బస్సు సర్వీసులను ప్రారంభించాలని పదేపదే కోరినా ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని విమర్శిస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రం హామీల వర్షం కురిపించే నాయకులు ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజల సమస్యలను పూర్తిగా మరిచిపోతున్నారని మండలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. “వినతి పత్రాలు తీసుకోవడానికేనా అధికారులు..? ప్రజల కష్టాలు పరిష్కరించడానికా..?” అంటూ మండల ప్రజలు నిలదీస్తున్నారు. చర్ల మండలం వాణిజ్య, వ్యవసాయ, అటవీ ప్రాంతాలకు కేంద్రబిందువుగా ఉన్నప్పటికీ సరైన ఆర్టీసీ సౌకర్యాలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా రవాణా విస్తరణ గురించి పెద్ద పెద్ద ప్రకటనలు చేస్తుంటే చర్ల వంటి దూర ప్రాంతాలు మాత్రం ఇంకా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని మండలవాసులు వాపోతున్నారు.

### ››› మండల ప్రజల ప్రధాన డిమాండ్లు :

చర్ల నుండి హైదరాబాద్ కు నేరుగా సూపర్ లగ్జరీ / రాజధాని బస్సు ఏర్పాటు, చర్ల–విజయవాడ, గుంటూరు ప్రత్యేక ఎక్స్ ప్రెస్ సర్వీసులు ఏర్పాటు, జిల్లా కేంద్రం కొత్తగూడెంకు నేరుగా బస్సు సౌకర్యం ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. చర్ల ప్రజలు ఇంకా "ఎన్నాళ్లు నిరీక్షించాలో"..? అని ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం ఎప్పుడు ముగుస్తుంది..?” అంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు . ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి చర్ల ప్రజల దూరప్రాంతాలకు రవాణా కష్టాలను అర్థం చేసుకోవాలని ఎన్నోసంవత్సరాలుగా ఎదురు చూస్తున్న దూరప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను త్వరగా ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు .

## బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలి

- కేసును సిట్‌కు అప్పగించాలని జేబీపీ డిమాండ్



**కొత్తగూడెం, మే 10 ( ప్రజాజ్యోతి )** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన లైంగిక వేధింపుల కేసును నిష్పాక్షికంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్ ) ఏర్పాటు చేయాలని బండి సంజయ్‌ను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలో ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులను బెదిరించారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. మహిళల భద్రత, గౌరవం, న్యాయం వంటి అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సమయంలో కేంద్ర మంత్రికి సంబంధించిన కుటుంబ సభ్యుడిపై ఇలాంటి ఆరోపణలు రావడం విచారకరమన్నారు. రాజకీయ హోదాలు, అధికార ప్రభావం కారణంగా దర్యాప్తు ప్రభావితమయ్యే అవకాశాలు ఉన్నందున రాష్ట్ర స్థాయిలో సిట్ ఏర్పాటు చేసి పారదర్శకంగా విచారణ జరపాలని కోరారు. బాధిత కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించడంతో పాటు కేసులో దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం ముందు అందరూ సమానులనే రాజ్యాంగ సూత్రాన్ని ప్రభుత్వం కాపాడాలని అధికారంలో ఉన్నవారికి ఒక న్యాయం సామాన్య ప్రజలకు మరో న్యాయం అనే పరిస్థితి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. మహిళలపై నేరాల విషయంలో రాజకీయ ప్రభావాలకు తావులేకుండా ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. దేశ ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన పదవుల్లో ఉన్నవారు తమపై లేదా కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కేసులో పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి నిజాలు వెలుగులోకి తేవాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు జేబీపీ తరఫున పోరాటం కొనసాగిస్తామని యెర్రా కామేష్ స్పష్టం చేశారు.

## భవన నిర్మాణం కార్మికులకు పెంచిన రేట్లును గ్రామాల్లో ప్రచారం



**టేకులపల్లి,మే10, ప్రజాజ్యోతి:** ప్రగతిశీల భవన నిర్మాణ కార్మికుల సంఘం ఐఎఫ్టియు టేకులపల్లి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం టేకులపల్లి మండల వ్యాప్తంగా పెరిగిన రేట్లపై కార్మికులకు తెలుపుతూ పెరిగిన రెట్లను మాత్రమే తీసుకోవాలని ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ప్రసాద్ కార్మికుల కు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి అవసరమైన నిత్యవసర సరుకులు ధరలు పెరిగిన అనుగుణంగా కూలీరేట్లను పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని సందర్భంగా తెలియజేశారు. ఇట్టి రేట్లు మేస్త్రీలు కూలీలు అమలు చేయాలని అన్నారు. ఎవరైనా అతిక్రమించినచో కార్మిక వ్యతిరేక విధానాలం ప్రకారం యూనియన్ నాయకులచే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిరి, మేస్త్రి కార్తీక్, పెనక సత్యం,ఆత్మకూరు శ్రీను మేస్త్రి, ఈసం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి హాస్పిటల్‌లో సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్

- 80 మంది రోగులకు వైద్య పరీక్షలు



**కొత్తగూడెం, మే 10 (ప్రజాజ్యోతి )** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌లో సూపర్ స్పెషాలిటీ హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీకర హాస్పిటల్ నిపుణ వైద్యులు కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాల్లో వైద్య సేవలు అందించారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో క్యాంప్‌కు హాజరయ్యారు. మొత్తం 80 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో కార్డియాలజీ విభాగంలో 28 మంది, గ్యాస్ట్రో ఎంట్రాలజీలో 10 మంది, న్యూరాలజీలో 24 మంది, యూరాలజీ–నెఫ్రాలజీ విభాగాల్లో 18 మందికి పరీక్షలు చేశారు. డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు సలహాలు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ సూచనల మేరకు ఈ క్యాంప్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అడిషనల్ సీఎంవో ఉష పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలితతో పాటు మెయిన్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు గిరిజన దర్బార్.....ప్రజావాణి





**భద్రాచలం టౌన్ , మే 10 , ప్రజాజ్యోతి** భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్, సబ్ కలెక్టరు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు అధికారులంతా సకాలంలో హాజరై వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించడంతో పాటు వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్, సబ్ కలెక్టర్ మృణాల్‌శ్రేష్టలు పేర్కొన్నారు. ప్రజలు తమ విజ్ఞాపన పత్రాలు, తగిన ధృవీకరణ పత్రాలతో రావాలని కోరారు.

# వివాహ వేడుకలో సందడి చేసిన మాజీ ఎమ్మెల్యే తాటి



**ములకలపల్లి, మే 10, ప్రజాజ్యోతి:** మండలంలోని పొగళ్ళపల్లి గ్రామంలో జరిగిన గుడిబండ్ల శ్రీనివాసరావు–వాణి దంపతుల కుమారుడు నితీష్ కుమార్ వివాహ వేడుకలో బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నూతన వరుడిని ఆశీర్వదించిన ఆయన, నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బ్యాండ్ వాయిస్తూ వివాహ వేడుకలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైటి రాజేష్, పాలకుర్తి రత్నభూషణం, పుల్లారావు, బొంతు నందు చౌదరి తదితరులు పాల్గొన్నారు

# నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాటాలకు సిద్ధం కావాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో విధివిధానాల ప్రతుల దహనం




**కొత్తగూడెం, మే 10 ( ప్రజాజ్యోతి )** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మిక ఉద్యమాలు కొనసాగుతాయని మరో స్వాతంత్ర పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజె రమేష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడ్‌ల విధివిధానాల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎజె రమేష్ మాట్లాడుతూ బీజేపీ–మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే పనిగంటలు పెరగడంతో పాటు కార్మికుల హక్కులు దెబ్బతింటాయని అన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు కట్టు బానిసల్లా మారే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనడం ద్వారా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ నిరసన తెలియజేశారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని లేకుంటే భవిష్యత్తులో కార్మికులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారని విమర్శించారు. బ్రిటిష్ కాలంలో సాధించుకున్న కార్మిక హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. కార్మిక–కర్షక ఐక్యతతో మోడీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మందా నరసింహరావు, పట్టణ కన్వీనర్ భూక్య రమేష్, జిల్లా కమిటీ సభ్యులు విక్కి బాలరాజు, అంబాల దుర్గమ్మ, నందిపాటి రమేష్, రాజారావు, పప్పుల ప్రమోద్, సురం ఐలయ్య, శారద, గణేష్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం : టీమ్ ఆగ్రహం

- దళితుల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్న ఎస్సీ వర్గీకరణ
- కులాల వారీగా కాకుండా ఆర్థిక ప్రాతిపదికన వర్గీకరణ చేయాలని సూచన
- మాలలకు కనీస ప్రాతినిధ్యం కూడా లేకుండా పోతోందన్న ఆవేదన
- రోస్టర్ విధానంతో మాల విద్యార్థులు, నిరుద్యోగులకు తీవ్ర నష్టం : మంద రంజిత్ కుమార్
- 59 ఎస్సీ కులాలకు సమన్యాయం చేయాలని డిమాండ్ : దాసరి చెన్నకేశవులు





**కొత్తగూడెం, మే 10 ( ప్రజాజ్యోతి )** ఎస్సీ వర్గీకరణ పేరుతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని దళితుల ఐక్యత దెబ్బతింటోందని తెలంగాణ ఎడ్యుకేట్స్ అసోసియేషన్ ఫర్ మాల (టీమ్ ) నాయకులు ఆరోపించారు. మాలలపై జరుగుతున్న వివక్షను ఎదుర్కొనేందుకు హక్కుల సాధన కోసం మాలల న్యాయ పోరాట సభను ఆదివారం కొత్తగూడెంలోని బాబూక్యాంప్ పరిధిలో గల జీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు దాసరి రమేష్, గౌరవ సలహాదారులు కాకెల్లి సైమన్ ఆధ్వర్యంలో ఎస్‌సీసీఎల్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ శనగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సభకు మాలలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాలల రాజ్యాధికార సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, జే.యస్.టి.యు.హెచ్ జే.ఏ.సి చైర్మన్ మంద రంజిత్ కుమార్, బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బరగడి దేవదానం లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎంపిరికల్ డేటా ఆధారంగా ఉపవర్గీకరణ చేయాల్సి ఉండగా తెలంగాణ ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఎస్సీలను కులాల వారీగా విభజించిందని విమర్శించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న రోస్టర్ విధానం కారణంగా మాల విద్యార్థులు విద్యా అడ్మిషన్లు, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రమోషన్లలో తీవ్ర నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రూప్–3లో మాలలు, మాల ఉపకులాలకు కేటాయించిన రోస్టర్ పాయింట్ల వల్ల చిన్న స్థాయి ఉద్యోగ నోటిఫికేషన్లలో కనీసం ఒక్క పోస్టు కూడా దక్కని పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. దీంతో చదువుకున్న యువత నిరుద్యోగులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణను కులాల వారీగా కాకుండా ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా అమలు చేయాలని సూచించారు. ఎస్సీలలో అభివృద్ధి చెందిన వారిని ఒక గ్రూప్‌గా, వెనుకబడిన వారిని మరో గ్రూప్‌గా వర్గీకరిస్తేనే 59 ఎస్సీ కులాలకు సమాన న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల శాతాన్ని 15 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ వర్గీకరణ కోసం ఏర్పాటు చేసిన షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నివేదికను, ఎంపిరికల్ డేటాను ప్రజా డొమైన్‌లో విడుదల చేయాలని కోరారు. 2011 తో పోలిస్తే 2024 జనాభా లెక్కల్లో మాలల జనాభా తగ్గుదలపై ప్రభుత్వం శాస్త్రీయ ఆధారాలతో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేలా 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల్లో మార్పులు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. మాలలకు విద్య, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పోలుమూరి ధనలక్ష్మి, నామా కీర్తి, మద్దాల హరిత, గుర్రం వెంకటేశ్వర్లు, కాల్వ భాస్కర్, ఉపసర్పంచ్ పొలామూరి శ్రీనివాస్, ఆచార్య, డాక్టర్ మద్దెల శివకుమార్, యెర్ర కామేష్, దాసరి శేఖర్, కె. నవతన్, శనగ రాంచందర్, మొంటం బలరాం, కమలాకర్, శనగ లక్ష్మణ్, స్వామి, మేదిని లక్ష్మి, కరిస్మ రత్నకుమారి, దమళ్ళ శోభరణి, తంబళ్ల సామెలు, గుర్రం లక్ష్మయ్యలతో పాటు సభలో మాల సంఘాల ప్రతినిధులు, మేధావులు, యువత, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలి

- సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు



**ములకలపల్లి మే 10, ప్రజాజ్యోతి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని ప్రయత్నిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే నిలిపివేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిమ్మల మధు మాట్లాడుతూ, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు దొడ్డిదారిన ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేకమైన ఈ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్సీఆర్ ప్రాంతంలోని ఫ్యాక్టరీలు, పెద్ద పారిశ్రామిక సంస్థల్లో అధిక సంఖ్యలో వలస కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. అయితే వారికి మౌలిక కార్మిక హక్కులు అమలు కావడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు మాత్రమే వేతనాలు ఇస్తూ తీవ్ర శ్రమ దోపిడీ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ల అమలుతో కార్మికుల సమిష్టి బేరసారాల శక్తి బలహీనపడుతుందని, రోజుకు 13 గంటల పాటు పనిచేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. వలస కార్మికులకు భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ వంటి చట్టబద్ధ హక్కులను వలస కార్మికులకు అమలు చేయాలని కోరారు. కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సున్నం నాగేంద్రబాబు, గోపి, రాము, దాని రాము, బిజే, బాలరాం, కౌసల్య, జోగి, సుందరి, పాండే, శివ పాల్గొన్నారు.

# సెంట్రల్ లైటింగ్ పనులు.. డ్రైనేజీ లేక ప్రజలకు కష్టాలు





- వర్షం వస్తే చాలు ఇళ్లలోకి చేరుతున్న వరద నీరు
- శాశ్వత పరిష్కారం కోరుతున్న బాధిత కుటుంబాలు

**అన్నపురెడ్డిపల్లి, మే 10, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల పలు కాలనీలు అర్ధరాత్రి కురిసిన అకాల వర్షాలకు జలమయమయ్యాయి. మండల కేంద్రంలో కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులలో భాగంగా ఇప్పటివరకు డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంతో పైనుంచి వచ్చిన వరద నీరు నేరుగా నివాస గృహాల్లోకి, చిరు వ్యాపారుల దుకాణాల్లోకి చేరింది. దీంతో నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు పూర్తిగా తడిసి పోగా పలు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారి పక్కన నివసించే కుటుంబాలు, చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహించే దుకాణదారులు ఎక్కువగా నష్టపోయినట్లు తెలుస్తోంది. వరద నీరు ఒక్కసారిగా దుకాణాల్లోకి చేరడంతో కిరాణా సామగ్రి, ఫర్నిచర్, విద్యుత్ పరికరాలు నీటిలో తడిసి పాడయ్యాయి. కొంతమంది వ్యాపారులు దుకాణాల్లో నిల్వ ఉంచిన సరుకులను బయటకు తీసేలోపే నీరు నిండిపోవడంతో భారీ నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పలు ఇళ్లలో మంచాలు, దుస్తులు, ధాన్యం సంచులు నీటిలో తడవడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. చిన్నారులు, వృద్ధులు రాత్రంతా నిద్రలేక భయాందోళనలకు గురయ్యారని స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం గత నాలుగు ఐదు ఏళ్లలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదని, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్లే వరద నీరు ఇళ్లలోకి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరితగతిన శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపాలని బాధితులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పర్సా వెంకట్, మండల యువజన నాయకుడు వేముల నరేష్, గ్రామ ఉపసర్పంచ్ మారగాని అశోక్, గ్రామ పెద్దలు మరియు పలువురు కార్యకర్తలు బాధిత ప్రాంతాల్లో పర్యటించి కుటుంబాలను పరామర్శించారు. నీట మునిగిన ఇళ్లను, పాడైన సామాగ్రిని పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు. సమస్యను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అందరం కలిసి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# టీఎన్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ ను పరామర్శించిన తాటి వెంకటేశ్వర్లు



**ములకలపల్లి, మే 10 ప్రజాజ్యోతి:** మండలంలోని పొగళ్లపల్లి గ్రామానికి చెందిన టీఎన్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు మాతృమూర్తి లలితాదేవి ఇటీవల మృతి చెందారు. ఆదివారం వారి నివాసానికి వెళ్లిన బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు లలితాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తాండ్ర వెంకటేశ్వరరావును పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నడిపల్లి నవీన్, మాజీ సర్పంచ్ బైటి రాజేష్, పుల్లారావు, పాలకుర్తి రత్నభూషణం, గాదెగోని వెంకటేష్ గౌడ్, బొంతు నందు చౌదరి తదితరులు పాల్గొన్నారు

# 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు

- సాహిత్య మహాసభల బాధ్యతల్లో జి .లక్ష్మణ్ కుమార్



**చర్ల, మే 10:(ప్రజాజ్యోతి):** తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య వైభవాన్ని విశ్వవ్యాప్తంగా చాటిచెప్పే లక్ష్యంతో నిర్వహించనున్న 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లకు చెందిన జి. లక్ష్మణ్ కుమార్‌ను కళారత్న విజ్ఞాన సమన్వయకర్తగా నియమించినట్లు శ్రీ శ్రీ కళావేదిక జాతీయ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షులు జి. ఈశ్వరి భూషణ్ , జాతీయ ప్రధాన కార్యదర్శి డా. ఎం. రవికుమార్ సంయుక్తంగా నియామక పత్రాన్ని విడుదల చేశారు. రాజమహేంద్రవరం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో జూన్ 6, 7 తేదీల్లో రెండు రోజులపాటు అత్యంత వైభవంగా ఈ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు భాష గౌరవం, సాహిత్య సౌరభం, కళా వైభవాన్ని ఒకే వేదికపై ప్రతిబింబించేలా ఈ మహాసభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల సమన్వయం, శాస్త్రీయ ప్రణాళిక, సృజనాత్మక నిర్వహణలో జి. లక్ష్మణ్ కుమార్ సేవలు కీలకంగా ఉంటాయని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు. తెలుగు భాష వికాసానికి ఈ మహాసభలు దోహదపడతాయని, సాహిత్యాభిమానులు, కళాకారులు, రచయితలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# భద్రాద్రి రామయ్యకు రూ.3 లక్షల విలువైన బంగారు తులసీదళాలు అందజేత

- స్వామి వారి మూలవరులకు ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన



**భద్రాచలం టౌన్, మే 10, ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం సందర్భంగా అంతరాలయంలో ఆర్జిత సేవలో భాగంగా ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అదేవిధంగా భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన కుండ్లకుంట శ్రీకాంత్, నీలిమ దంపతులు సుమారు రూ.3 లక్షలు విలువ గల రాగిపై బంగారు పూతతో తయారు చేసిన 108 తులసీ దళాలను విరాళంగా అందజేశారు. వీరు తొలుత లలయంలో స్వామి వారికి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, లింఆల సాయిబాబాలకు అందజేశారు.

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత




**భద్రాచలం టౌన్ , మే 10 ప్రజాజ్యోతి** భద్రాచలంలో ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్ భద్రాచలం పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్ ప్రవీణ్ అనే వ్యక్తిదిగా గుర్తించి స్టేషన్‌కు తరలించారు. అలాగే ట్రాక్టర్‌పై ఎస్సై శ్యాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏఈ నిర్లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల జాప్యం

- హౌసింగ్ ఏఈపై చర్యలు తీసుకోవాలి - సర్పంచ్ మడకం విజయ



**ములకలపల్లి, మే 10 (ప్రజాజ్యోతి):** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హౌసింగ్ ఏఈపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాసన్నగూడెం సర్పంచ్, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకురాలు మడకం విజయ డిమాండ్ చేశారు. ఆదివారం రాసన్నగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ, హౌసింగ్ ఏఈ నిర్లక్ష్యం వల్ల బిల్లుల మంజూరు ఆలస్యమవుతోందని ఆరోపించారు. గత నెల రోజులుగా ఏఈ మండలానికి అందుబాటులో లేకపోవడంతో పాటు, ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. ఇళ్ల ఫోటోలు తీయడానికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇచ్చిన వారి పనులకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. వర్షాకాలం సమీపిస్తున్నప్పటికీ, దశల వారీగా ఫోటోలు తీసి బిల్లులు మంజూరు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు ఇస్తున్నా, మండలంలో పరిస్థితి భిన్నంగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హౌసింగ్ ఏఈపై చర్యలు తీసుకోవాలని, సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించనున్నట్లు తెలిపారు